ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# మన ప్రజాప్రతినిధి
తెలుగు దిన పత్రిక
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :158 శుక్రవారం ఏప్రిల్ 3 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# నిత్యావసర ధరల మంట

- మధ్యతరగతి గుండెల్లో గుబులు
- వంటగ్యాస్, పెట్రోల్ ధరల సెగ
- రవాణా ఛార్జీల పెరుగుదలతో పైపైకి కూరగాయల ధరలు
- సామాన్యుడి నెలవారీ బడ్జెట్ తలకిందులు



ఏప్రిల్ 02 (మనప్రజాప్రతినిధి): దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలు అతలాకుతలమవుతున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్ నెల ప్రారంభం నుండే ధరల మంట మొదలైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరగడం, పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో పెట్రోల్ ధర లీటరుకు రూ.107 దాటగా, డీజిల్ ధర కూడా రూ.96 మార్కును సమీపించింది. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం నేరుగా నిత్యావసర వస్తువుల సరఫరాపై పడి, మార్కెట్‌లో ప్రతి వస్తువు ధర రెట్టింపు కావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వంటగ్యాస్ సిలిండర్ ధరలు కూడా సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో డొమెస్టిక్ ఎల్‌పీజీ (14.2 కిలోల) సిలిండర్ ధర సుమారు రూ.965కి చేరుకుంది. గత మార్చి నెలలో జరిగిన పెంపు తర్వాత ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, వెయ్యి రూపాయలకు దగ్గరగా ఉండటం పేద కుటుంబాలకు పెను భారంగా మారింది. మరోవైపు కమర్షియల్ సిలిండర్ల ధరలు ఏప్రిల్ 1న భారీగా పెరగడంతో హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో తినుబండారాల ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీనివల్ల మధ్యతరగతి ప్రజలు బయట భోజనం చేయాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వంటింటి బడ్జెట్ అదుపు తప్పడంతో గృహిణులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక కూరగాయలు, పప్పు దినుసుల ధరల గురించి చెప్పనవసరం లేదు. రవాణా ఖర్చులు పెరగడంతో మార్కెట్‌కు వచ్చే సరుకులపై అదనపు భారం పడుతోంది. టమోటా, పచ్చిమిర్చి వంటి నిత్యావసర కూరగాయల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నాయి. రిటైల్ మార్కెట్‌లో కిలో పప్పుల ధరలు కూడా భారీగా పెరిగాయి. వేసవి కాలం కావడంతో నీటి ఎద్దడి, పంట దిగుబడి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఆదాయం పెరగకపోయినా, ఖర్చులు మాత్రం రోజురోజుకూ పెరుగుతుండటంతో నెల గడవడం గగనమవుతోందని కూలీలు, చిరుద్యోగులు వాపోతున్నారు. ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మళ్ళీ పెరుగుదల బాట పట్టింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో నమోదైన గణాంకాలు సామాన్యుడి కొనుగోలు శక్తి తగ్గుతున్నట్లు సూచిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో స్కూల్ ఫీజులు, పుస్తకాలు మరియు రవాణా ఛార్జీల భయం తల్లిదండ్రులను వెంటాడుతోంది. పండుగలు, శుభకార్యాల సీజన్ కావడంతో ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉందని, పొదుపు చేసుకున్న డబ్బు కూడా ప్రస్తుత అవసరాలకే సరిపోవడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ధరల అదుపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులను తగ్గించడం ద్వారా రవాణా వ్యయాన్ని తగ్గించాలని, తద్వారా నిత్యావసరాల ధరలను నియంత్రించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించే దళారులపై నిఘా ఉంచాలని, రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే వస్తువులు అందేలా చూడాలని కోరుతున్నారు. సామాన్యుడి పళ్లెంలో ఆహారం భారంగా మారకుండా చూడాల్సిన బాధ్యత పాలకవర్గాలపై ఉందని, అప్పుడే సామాజికంగా ఆర్థిక భద్రత సాధ్యమవుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# గ్రామసభలతో... ప్రజాపాలన ప్రజలకు చేరువ



- సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు
- ప్రజల సమస్యలకు గ్రామస్థాయిలోనే పరిష్కారం
- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ప్రారంభమయ్యాయి. అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత దగ్గర చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడం తో పాటు గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే గ్రామసభల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వేగంగా పరిష్కారాలు అందించవచ్చని అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్, సన్నరకం వడ్ల బోనస్, చేయూత పింఛన్లు, గృహజ్యోతి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించారు. త్వరలో అమలు చేయనున్న కుటుంబ జీవితం బీమా, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి పథకాల గురించి కూడా వివరించారు.అశ్వాపురం గ్రామంలో అమలవుతున్న పథకాల లబ్ధిదారుల వివరాలను కూడా కలెక్టర్ వెల్లడించారు. రైతు భరోసా కింద 1,369 మందికి రూ.2.34 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల కింద 58 మందికి రూ.2.90 కోట్లు, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.75.58 కోట్లు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. గ్యాస్ సబ్సిడీ, పింఛన్లు, గృహజ్యోతి, రేషన్ కార్డులు, మహిళా సంఘాల రుణాలపై వివరాలు వివరించారు.గ్రామస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు, అర్హతల జాబితాలను స్పష్టంగా ప్రదర్శించాలని అధికారులకు ఆదేశించారు. విద్య, వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామసభల్లో స్థానిక సమస్యలను చర్చించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రతి గ్రామంలో ప్రత్యేక పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# మూసీ ప్రాజెక్టుపై... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తు



- -డీపీఆర్ లేకుండా రూ. 1.5 లక్షల కోట్ల ఖర్చు ఎలా?
- -లండన్, సియోల్ నగరాల ప్రస్తావనపై సీఎం రేవంత్‌కు ప్రశ్నల వర్షం
- -బాధితులతో చర్చలు జరపకుండా ప్రాజెక్టు చేపట్టడంపై అభ్యంతరం
- -లక్షలాది మంది నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందని ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక ఇప్పటివరకు విడుదల చేయకుండానే, లక్షన్నర కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టును ఎలా చేపడతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే లండన్ థేమ్స్ నది, దక్షిణ కొరియాలోని సియోల్, సింగపూర్ నగరాల గురించి మాట్లాడుతున్నారని, అయితే అక్కడ అనుసరించిన పద్ధతులకు, ఇక్కడ జరుగుతున్న తీరుకు అస్సలు పొంతన లేదని ఆయన విమర్శించారు.లండన్‌లోని థేమ్స్ నది పునరుజ్జీవన ప్రాజెక్టు 150 ఏళ్లుగా కొనసాగుతూనే ఉందని, అటువంటి భారీ

2

# గంజిపేటలో చౌక ధరల దుకాణంపై ఆకస్మిక తనిఖీ




- గద్వాల కలెక్టర్ దూకుడు చర్యలు
- లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన అధికారులు
- మూడు నెలల బియ్యం ముందస్తు పంపిణీపై సూచనలు

గద్వాల, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): గద్వాల జిల్లా కేంద్రంలోని గంజిపేట రహదారిలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ విధానం, స్టాక్ పరిస్థితి, లబ్ధిదారులకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ పథకం ద్వారా ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్నదని తెలిపారు. ఈ పథకం సమర్థవంతంగా అమలవ్వాలని, ఎలాంటి అక్రమాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను ఈ నెలలోనే ఒకేసారి పంపిణీ చేయాలని ఆదేశించారు.దుకాణం పరిధిలోని తెల్ల రేషన్ కార్డులు, అంత్యోదయ కార్డుల వివరాలను కలెక్టర్ రేషన్ డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సరైన విధంగా నిర్వహణ జరుగుతోందో లేదో నిర్ధారించారు. అక్కడికి వచ్చిన పలువురు లబ్ధిదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకుని, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.లబ్ధిదారులకు బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియను కూడా పరిశీలించారు. పారదర్శకంగా పంపిణీ జరగాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.



# నేను బతికుండగా... డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను



- హుజురాబాద్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమరశంఖం
- తాను బతికుండగా డంపింగ్ యార్డ్ పెట్టనివ్వనని భీష్మ ప్రతిజ్ఞ
- ఏప్రిల్ 7, 8 తేదీల్లో నిరసన దీక్షకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే
- ఏప్రిల్ 3న హుజురాబాద్ బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి

2

# మూసీ ప్రాజెక్టుపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తు

మెదటి పేజీ తరువాయి



ప్రక్రియను ముఖ్యమంత్రి కేవలం రెండున్నరేళ్లలో ఎలా పూర్తి చేస్తారని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. అలాగే సియోల్ నగరంలో నదీ పునరుజ్జీవన పనులు ప్రారంభించే ముందు, అప్పటి పాలకులు సుమారు 4200 సార్లు అక్కడి ప్రజలతో చర్చలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారని గుర్తు చేశారు. మరి తెలంగాణలో మూసీ పరివాహక ప్రాంత బాధితులతో ముఖ్యమంత్రి ఎందుకు చర్చలు జరపడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బాధితుల గోడు వినకుండా నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్షలాది మంది పేదలు, సామాన్యులు తమ గూడు కోల్పోయి అడ్డాకూలీలుగా, నిరాశ్రయులుగా మారే ప్రమాదం ఉందని ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ అనేది ఒక పెద్ద దోపిడీ అని, దీని వెనుక ఉన్న అసలు వాస్తవాలను త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వివరిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వం చేయబోతున్న ఈ దోపిడీని అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, ప్రాజెక్టు వివరాలను బహిర్గతం చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బాధితులకు సరైన పునరావాసం మరియు నష్టపరిహారం కల్పించకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయనివ్వబోమని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో పేదల పొట్ట కొట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఆయన విమర్శించారు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి తాము సిద్ధమవుతున్నామని, మూసీ బాధితుల పక్షాన తమ పార్టీ నిలబడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

# నేను బతికుండగా.. డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను

మెదటి పేజీ తరువాయి



హుజురాబాద్,ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని సిర్సపల్లి సమీపంలో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ అంశంపై స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బతికుండగా హుజురాబాద్ గడ్డపై డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనిచ్చే ప్రసక్తి లేదని ఆయన గురువారం స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మరియు నాయకులతో కలిసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వులను బహిరంగంగా చదివి వినిపించారు. స్వయంగా ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారని, ఇది ప్రజల జీవన్మరణ సమస్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణం దెబ్బతిని, ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టమయ్యే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనకు నిరసనగా ఈ నెల 3వ తేదీన (శుక్రవారం) హుజురాబాద్ బంద్‌కు కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ బంద్‌ను రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు మరియు స్వచ్ఛంద సంస్థలు విజయవంతం చేయాలని కోరారు. దవాఖానాలు, మెడికల్ షాపులు వంటి అత్యవసర సేవలు మినహా మిగతా అన్ని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగా జరిగే ఈ బంద్‌ను అడ్డుకోవాలని పోలీసులు ప్రయత్నించవద్దని, ఇది ప్రజలందరి సమస్య అని ఆయన పేర్కొన్నారు. తొలుత 4వ తేదీన బంద్ అనుకున్నప్పటికీ, తనకు సిఐడి విచారణ ఉన్నందున చట్టాన్ని గౌరవిస్తూ ఒక రోజు ముందుగానే బంద్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఏప్రిల్ 7 మరియు 8 తేదీల్లో తాను స్వయంగా దీక్షకు దిగుతానని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రకటించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే దీక్షా శిబిరంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చుని నిరసన తెలుపుతానని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మరియు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు లేఖలు రాసినట్లు ఆయన వివరించారు. అసెంబ్లీలో కూడా ముఖ్యమంత్రికి దండం పెట్టి మరీ హుజురాబాద్ ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని కోరానని, అయినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం సరికాదని ఆయన విమర్శించారు. డంపింగ్ యార్డ్ కమ్ ఎనర్జీ ప్లాంట్ పనుల కోసం ఎవరూ టెండర్లు వేయవద్దని కౌశిక్ రెడ్డి కాంట్రాక్టర్లను హెచ్చరించారు. హైదరాబాద్‌లోని జవహర్ నగర్ ప్లాంట్ వల్ల అక్కడి ప్రజలు పడుతున్న నరకాన్ని అందరూ చూస్తున్నారని, హుజురాబాద్‌కు ఆ గతి పట్టనివ్వబోమని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా టెండర్లు వేస్తే అడ్డుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హుజురాబాద్ గడ్డ పోరాటాలకు నిలయమని, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఈ ప్రాంత ప్రజలు తమ అస్తిత్వం కోసం మళ్లీ పోరాడతారని ఉద్వేగంగా చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై ఈ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు

# కేరళ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

**-5 'ఇందిరమ్మ గ్యారెంటీ'లను ప్రకటించిన యూడీఎఫ్**
**-తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మేనిఫెస్టో ఆవిష్కరణ**
**-రూ. 25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**
**-నిరుద్యోగ యువత, విద్యార్థినులకు ఆర్థిక చేయూతనిచ్చే పథకాలు**



తిరువనంతపురం, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): కేరళ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ తన ఎన్నికల మేనిఫెస్టోను గురువారం అత్యంత వైభవంగా విడుదల చేసింది. కేరళ ప్రతిపక్ష నేత వి.డి. సతీశన్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నేతల సమక్షంలో ఈ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ, కేరళ అభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని సతీశన్ ప్రకటించారు. తెలంగాణలో కాంగ్రెస్ అమలు చేస్తున్న విజయవంతమైన నమూనాను స్ఫూర్తిగా తీసుకుని, కేరళలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. యూడీఎఫ్ మేనిఫెస్టోలో ప్రధానంగా '5 ఇందిరమ్మ గ్యారెంటీ'లను ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచిత సమగ్ర ఆరోగ్య బీమా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు. సామాజిక భద్రతా పింఛన్లను నెలకు రూ. 3,000 కు పెంచుతామని, ఇది వృద్ధులకు మరియు పేదలకు ఎంతో ఊరటనిస్తుందని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ గ్యారెంటీలు కేరళలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చే విధంగా రూపొందించామని, అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిని అమలు చేస్తామని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. యువత మరియు విద్యార్థుల కోసం మేనిఫెస్టోలో ప్రత్యేక పథకాలను పొందుపరిచారు. నిరుద్యోగ యువత మరియు స్వయం ఉపాధిని కోరుకునే యువ పారిశ్రామికవేత్తల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కళాశాల విద్యార్థినులకు నెలకు రూ. 1,000 చొప్పున స్టైపెండ్ అందిస్తామని ప్రకటించారు. ఈ పథకాలు యువతను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, వారి విద్యాభ్యాసానికి మరియు ఉపాధి అవకాశాలకు తోడ్పడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేరళ భవిష్యత్తును మార్చే దిశగా ఈ మేనిఫెస్టో ఒక బలమైన అడుగు అని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమం కేరళ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. 'కేరళ గెలుస్తుంది – యూడీఎఫ్ నడిపిస్తుంది' అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బరిలోకి దిగుతోంది. స్థానిక నాయకత్వం మరియు ఏఐసీసీ ప్రతినిధుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. కేరళ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించిన ఈ మేనిఫెస్టో, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను చూపిస్తోందని యూడీఎఫ్ నేతలు పేర్కొన్నారు. ఈ భారీ బహిరంగ కార్యక్రమంతో కేరళ ఎన్నికల కురుక్షేత్రంలో యూడీఎఫ్ తన ప్రచార పర్వాన్ని అధికారికంగా వేగవంతం చేసింది.

# జగన్‌ను కలిసిన క్రైస్తవ మత పెద్దలు

**-గుడ్ ఫ్రైడే, ఈస్టర్ శుభాకాంక్షలు**
**-తాడేపల్లిలో వైఎస్సార్సీపీ అధినేతకు మత గురువుల ఆశీర్వచనం**
**-రాష్ట్ర ప్రజల శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు**
**-త్యాగానికి, ప్రేమకు ప్రతీక గుడ్ ఫ్రైడే అని కొనియాడిన జగన్**





తాడేపల్లి, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): పవిత్ర గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పర్వదినాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డిని వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో మత గురువులు జగన్‌కు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని దేవుని ఆశీస్సులు కోరుతూ ప్రార్థించారు. అనంతరం జగన్‌కు ఆశీర్వచనం అందజేసి, పర్వదినాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ మాట్లాడుతూ, గుడ్ ఫ్రైడే అనేది త్యాగానికి, నిస్వార్థమైన ప్రేమకు ప్రతీకగా నిలిచిన పవిత్ర దినమని కొనియాడారు. మానవాళి రక్షణ కోసం క్రీస్తు పడిన శ్రమలు, చూపిన సహనం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అలాగే ఈస్టర్ పర్వదినం ఆశకు, పునర్జన్మకు మరియు అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని అభివర్ణించారు. సమాజంలో ప్రతి ఒక్కరి మధ్య ప్రేమ, పరస్పర గౌరవం పెంపొందాలని, క్రీస్తు బోధించిన కరుణా మార్గంలో అందరూ పయనించాలని ఆయన ఆకాంక్షించారు. మత పెద్దల రాక తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ జగన్ గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబం ఆనందంతో, ఆరోగ్యంతో వర్ధిల్లాలని కోరుకున్నారు. క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, వారి సమస్యల పరిష్కారంలో ముందుంటుందని హామీ ఇచ్చారు. పర్వదినాల వేళ ప్రజలందరూ ఐకమత్యంతో ఉండి, పేదలకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. క్రైస్తవ మత పెద్దలు చేస్తున్న సామాజిక సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ క్రిస్టియన్ సెల్ ప్రెసిడెంట్ బొల్లవరపు జాన్ వెస్లీ, ఆర్చ్ బిషప్ ఎన్‌జెఎస్‌డి రాజు, బైబిల్ మిషన్ బిషప్ సంజీవరావు, మెట్రోపాలిటన్ చర్చెస్ బిషప్ సైమన్ సీజర్ సహా పలు మిషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రోమన్ క్యాథలిక్ మిషన్ బిషప్ అనిల్, సాల్వేషన్ ఆర్మీ చీఫ్ సెక్రటరీ గుర్నమ్ మసిహ్, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా బిషప్ గుళ్ళ మార్టిన్ తదితర ప్రముఖులు మరియు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు కూడా ఈ ప్రార్థనల్లో పాలుపంచుకున్నారు. వివిధ మిషన్లకు చెందిన ఈ మత పెద్దల కలయికతో తాడేపల్లి కార్యాలయం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.

# జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వర్ధంతి

ప్రజాప్రతినిధి(హుజూర్ నగర్):ఢిల్లీ సుల్తానుల గుండెల్లో నిదుర పోయిన వీర కేసరి. బడుగుల ఆత్మగౌరవ పతాకం. తొలి తెలుగు తేజం. గౌడ జాతి ముద్దుబిడ్డ బహుజన విప్లవ వీరుడుశ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వర్ధంతి సందర్భంగా, జై గౌడ్ ఉద్యమం సూర్యపేట జిల్లా అధ్యక్షుడు కేశగాని నాగేశ్వరరావు గౌడ్ అధ్యక్షతన హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షుడువల్లపుదాసు నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ కంతమహేశ్వర స్వామి దేవాలయం నిర్వహించడం జరిగింది. అనంతరం జై గౌడ పట్టణ అధ్యక్షుడు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ ఇంత గొప్ప మహనీయుని ఎప్పుడు మనం స్మరించుకొని ఇట్లాంటి కార్యక్రమాలు మునుముందు చేయాలని, ప్రతి ఒక్కరూ భావితరలకు ఈ మహనీయుని విజయ గాధను తెలియజేయాలని, జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జై గౌడ పట్టణ ఉపాధ్యక్షుడు సోమగాని మహేష్ గౌడ్, పులి నరసింహ గౌడ్, బాలబోయిన సత్యనారాయణ గౌడ్, ఆయిల వెంకన్న గౌడ్, కప్పల హుస్సేన్ గౌడ్,పలగాని సతీష్ గౌడ్, మూర్ల చిరంజీవి గౌడ్ తదితరులు కార్యక్రమం పాల్గొన్నారు.



# పోలవరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం

**-డయాఫ్రమ్ వాల్ పూర్తి**
**-1372 మీటర్ల పొడవైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం సక్సెస్**
**-గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అదనంగా వెయ్యి కోట్ల ఖర్చు**
**-2027 పుష్కరాల లోపు ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్న సీఎం**



3

# పోలవరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం




అమరావతి, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు నిర్మాణంలో గురువారం మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మనుగడకు అత్యంత కీలకమైన 1372 మీటర్ల పొడవైన 'డయాఫ్రమ్ వాల్' నిర్మాణాన్ని జలవనరుల శాఖ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మైలురాయిని చేరుకోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, రికార్డు సమయంలో పనులు పూర్తి చేసిన ఇంజనీర్లను మరియు అధికారులను అభినందించారు. ఈ నిర్మాణం పూర్తి కావడంతో ప్రాజెక్టు ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణానికి మార్గం సుగమమైందని, ఇకపై పనులు మరింత వేగవంతం అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మరియు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (ప్రాా) ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత నిర్ణయాల వల్ల పాత డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని, దానిని పునరుద్ధరించడం సాధ్యం కాకపోవడంతో కొత్తగా నిర్మించాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా రూ. 1000 కోట్ల భారం పడిందని, అయినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాజీ పడకుండా ఈ నిర్మాణాన్ని పూర్తి చేశామని వివరించారు. ఈ విజయం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పానికి నిదర్శనమని ఆయన కొనియాడారు.ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించిన ముఖ్యమంత్రి, పోలవరం నిర్మాణం కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల కల అని అభివర్ణించారు. ఇప్పటికే ప్రకటించిన ప్రణాళిక ప్రకారం, 2027లో జరిగే గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం ద్వారా రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలకు మరియు సాగునీటి కొరత ఉన్న జిల్లాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గకూడదని, అంతర్జాతీయ ప్రమాణాలతో డ్యామ్ పనులు సాగాలని అధికారులను ఆదేశించారు.డయాఫ్రమ్ వాల్ పూర్తి కావడంతో డ్యామ్ గ్యాప్-2 పనులు ఊపందుకోనున్నాయి. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణానికి పునాది లాంటి ఈ గోడ పూర్తవ్వడం వల్ల వరద ముప్పు ఉన్నప్పటికీ పనులు నిరంతరాయంగా సాగే అవకాశం ఉంటుంది. ఈ కీలక ఘట్టం పూర్తికావడం ప్రాజెక్టు నిర్మాణ చరిత్రలో ఒక టర్నింగ్ పాయింట్‌గా ఇంజనీర్లు భావిస్తున్నారు. ప్రాజెక్టు అంచనాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి నివేదిస్తూ, నిధుల కొరత రాకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు జలవనరుల శాఖలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పనులను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి చేసిన ఈ ప్రకటనతో పోలవరం నిర్వాసితుల్లో మరియు రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ప్రాజెక్టు పూర్తి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారిపోతాయని, పారిశ్రామిక మరియు వ్యవసాయ రంగాలు ఊపందుకుంటాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. పోలవరంపై ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో మిగిలిన నిర్మాణ పనులను కూడా ఇదే వేగంతో పూర్తి చేసి, అనుకున్న సమయానికి గోదావరి నీళ్లను కృష్ణా డెల్టాకు మరియు ఉత్తరాంధ్రకు తరలించడమే తమ తదుపరి లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది.

# అనకాపల్లిలో బడ్జెట్ ఔట్‌రీచ్

**-పారిశ్రామిక, వ్యవసాయ ప్రగతియే లక్ష్యం**
**-హోంమంత్రి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష**
**-2026-27 బడ్జెట్ కేటాయింపులపై లోతైన చర్చ**
**-జిల్లా అభివృద్ధికి అధికారులకు కీలక దిశానిర్దేశం**




అనకాపల్లి, ఏప్రిల్ 2 (మనప్రజాప్రతినిధి): అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 'బడ్జెట్ ఔట్‌రీచ్' సమావేశం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగిస్తూ, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గాల వారీగా జరిగిన కేటాయింపులపై ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గడిచిన కాలంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి పట్టాలెక్కించేందుకు ఈ బడ్జెట్ ఒక ఆశాకిరణంగా నిలుస్తుందని మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.అనకాపల్లి జిల్లాను అటు పారిశ్రామికంగా, ఇటు వ్యవసాయ రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామిక ప్రగతి ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించడంతో పాటు, అన్నదాతల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్లు ఆమె వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికి అందేలా పక్కా ప్రణాళికలు రూపొందించామని, అందరం కలిసికట్టుగా జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ప్రతి లబ్ధిదారునికి మేలు చేకూరాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొని బడ్జెట్ గణాంకాలు మరియు అమలు తీరుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరణ ఇచ్చారు.



జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు జరిగిన కేటాయింపులు, ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన మరియు పెండింగ్ పనుల పూర్తికి అవసరమైన నిధుల విడుదలపై మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని, నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు సూచించిన పలు స్థానిక సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి తక్షణమే నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖాధికారులను కోరారు. సమావేశంలో శాసనసభ్యులు ఎస్.ఎం.ఎస్. రాజు, సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొని తమ నియోజకవర్గాల అభివృద్ధి అవసరాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, ఏపీ ఆర్.డి.సి చైర్మన్ నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొట్నీ బాలాజీ కూడా హాజరై తమ శాఖల పరిధిలోని ప్రణాళికలను వివరించారు. గృహ నిర్మాణం, రహదారుల మరమ్మతులు మరియు రైతు సంక్షేమ పథకాల్లో అనకాపల్లి జిల్లాను ఆదర్శంగా నిలపాలని మంత్రులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో ఆయా కార్పొరేషన్ల పాత్రను మంత్రులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా యంత్రాంగం తరపున జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, రెవెన్యూ మరియు పోలీస్ శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని అధికారులు హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ బడ్జెట్ ఫలాలు అందేలా గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. మొత్తమ్మీద, అనకాపల్లి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఈ బడ్జెట్ ఔట్‌రీచ్ సమావేశం ఒక గొప్ప వేదికగా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలకు అత్యంత చేరువగా పాలనను తీసుకెళ్లడంలో ఇలాంటి సమన్వయ సమావేశాలు ఎంతో దోహదపడతాయని హోంమంత్రి అనిత గారు తన ముగింపు ఉపన్యాసంలో అభిప్రాయపడ్డారు.

# సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో గ్రామాల అభివృద్ధి

**-ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి-పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం తీర్మానాలు**




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం, ముఖ్యమంత్రి రేవంత్ నేతృతంలో రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడుతుందని సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం మేజర్ గ్రామపంచాయతీ ఆకునూరు సర్పంచ్ కొమ్మురవి అన్నారు.99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ అధ్యక్షతన వహించి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఇండ్లు లేని నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందని,మహిళలకు వడ్డీ లేని రుణాలు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. గృహ జ్యోతి కింద రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి ప్రజల ఇంటిలో వెలుగులు నింపుతుందని,రైతు రుణమాఫీ,రైతు భరోసా,కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఆకునూరు నుంచి అర్జున్ పట్ల వరకు రోడ్డు మంజూరు చేయాలని,ఇంకేంటిది గ్రామపంచాయతీ నుండి బీజర్ చివరస్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ మురికి కాలువల నిర్మాణం సిసి రోడ్లు,ఓపెన్ జిమ్,సింగల్ ఫేస్ మోటర్లు ఏర్పటు చేయాలని పలు అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసినట్లు తెలిపారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి కరిమోద్దీన్,ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్,వార్డు సభ్యులు నూనె శేఖర్,అందె లక్ష్మి, సూర అనిత,జూపల్లి కార్తీక్ రెడ్డి,తాటికొండ శేఖర్ యాదవ్,ఎండి హైమద్,భూమని భాస్కర్,గణపురం బాలనరసమ్మ,సుంచు హేమ,మంతపురి భాగ్యలక్ష్మి,స్వర్గం రాజేష్,వివిధ శాఖల అధికారులు,గ్రామస్తులు,సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి





హుస్నాబాద్ ఏప్రిల్ //మన ప్రజాప్రతినిధి. 02:హుస్నాబాద్ లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.శ్రీ హనుమాన్ దేవాలయం (పాటి మీద) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, ఆంజనేయస్వామి వారి అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు.కమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు నూకల కైలాసం, కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, బొలిశెట్టి రాజు, పిల్లి తిరుపతి, నాయకులు వి. వెంకటరమణ, వల్లపు రాజు, పున్న సది, దండి కొమురయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి



హుస్నాబాద్ ఏప్రిల్ //మన ప్రజా ప్రతినిధి.02: హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్, సర్వాయిపేట గ్రామాల మధ్య ఉన్న కొమ్ము గుట్ట వద్ద బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గౌడ కమ్యూనిటీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు మార్క అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాపన్న గౌడ్ సేవలను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆయన బహుజనుల హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గౌడ సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాపన్న గౌడ్‌కు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సర్వాయిపేట గ్రామ సర్పంచ్ పోలు స్వరూప ప్రవీణ్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్, పెద్ది వెంకట నారాయణ, పొన్నం అనూప్, గౌడ సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, వెంకన్న గౌడ్, మాటూరి గోపి గౌడ్, శ్యాంసుందర్ గౌడ్, ఉప సర్పంచ్ బాల్ రెడ్డి , జంపన్న, మాచెర్ల రమేశ్ గౌడ్, ఇల్లందుల లక్ష్మణ్, గట్టు రాములు, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజి, వివిధ మండలాల గౌడ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ విగ్రహ శోభాయాత్ర జరిగే ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

సదాశివపేట టౌన్ రిపోర్టర్ మార్చు 2 (మన ప్రజాప్రతినిధి):హనుమాన్ జయంతోత్సవ ఉత్సవాల కారణంగా సదాశివపేట పట్టణంలో గురువారం రోజు జరిగే శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఉండేలా చూడాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ గారు సదాశివపేట పట్టణ సిఐ గారు వారు స్వయంగా సదాశివపేట పట్టణంలో శోభ యాత్ర జరిగే ప్రాంతాలను పరిశీలించడం జరిగింది.



# ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలకు అందించడమే నా లక్ష్యం



సదాశివపేట టౌన్ రిపోర్టర్ ఏప్రిల్ 02( మన ప్రజాప్రతినిధి):–ఇంటి స్థలం లేని వారికి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం--సూరారం గ్రామ సర్పంచ్ మొగ్ధం పటేల్సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం సూరారం గ్రామం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమం సర్పంచ్ మొగ్ధం పటేల్ గ్రామ సెక్రెటరీ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మొగ్ధం పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా సంక్షేమం, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు, మహిళా గ్రూపులకు మహిళ భవనాలు, ఇల్లు లేని వారికి ఇండ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు, మౌలిక వసతులు, ఉపాధి వంటి కీలక రంగాల్లో స్పష్టమైన కార్యాచరణను చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని, ప్రతి వారం ఒక ముఖ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.పారదర్శక పాలనతో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని గ్రామ సర్పంచ్ మొగ్ధం పటేల్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఏ స్వప్న రెవెన్యూ అధికారి సాత్విక్ గ్రామ ఉపసర్పంచ్ మహమ్మద్ హైమద్ వార్డ్ మెంబర్లు ఫీల్డ్ అసిస్టెంట్ రాజు గ్రామ సర్పంచ్ మొగ్ధం పటేల్ గ్రామ పాలకవర్గం, సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారి సాత్విక్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , హెచ్ఎం శివకుమార్ ఏఎల్ఎం స్వరూపరాణి అంగడి వాడి టీచర్స్ వివిధ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లోపలి కోట హనుమాన్ మందిరంలో హనుమాన్ జన్మదినోత్సవ



సదాశివపేట టౌన్ రిపోర్టర్ ఏప్రిల్ 2 //( మన ప్రజాప్రతినిధి ):జన్మదినోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి పాటలతో భజనలు నిర్వహించారు. 18 వ వార్డు కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ కుమార్ , 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజుగౌడ్ , ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పప్పు పానకం ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది.అనంతరం 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్ జన్మదిన సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు గాజుల అశోక్, పోల మనోహర్, జయరామ్ మనోహర్, పోల సంగమేశ్వర్, బాలరాజ్, పద్మ గణేష్ లోపలి కోట పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ౯౯ రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇల్లంతకుంటలో గ్రామ సభ ఘనంగా నిర్వహణ





మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 02 ఏప్రిల్ :ఇల్లంతకుంట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ మామిడి రాజు మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమానికి జిల్లా స్పెషల్ ఆఫీసర్ పరిమళ దేవి, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ హాజరై గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు వాటి అమలు విధానంపై అధికారులు ప్రజలకు వివరించారు.గ్రామ సభలో ప్రజలు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల దరఖాస్తులు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇండ్ల పథకాలు, రైతు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలను కూడా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ సంబంధిత భూమి సమస్యలు, పాస్‌బుక్‌లు, సర్వే అంశాలపై కూడా ప్రజలు తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి రాజు మాట్లాడుతూ మానకొండూరు శాసన సభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఇల్లంతకుంట గ్రామ పంచాయతీకి కేటాయించిన నిధులతో గ్రామంలో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఇక ముందు కూడా ఎమ్మెల్యే సహకారంతో ఇల్లంతకుంట గ్రామ అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగు నాగరాజ్ శర్మ,వార్డు సభ్యులు దయ్యాల శ్రీలత-మహేష్, రేగుల కార్తీక్, ఎర్రోజు దీపిక-రవితేజ, మామిడి సుశీల, మామిడి శ్రీనివాస్, చేరాల వంశీకృష్ణ, రాకం సుమన్, కొట్టే ప్రమీల-వెంకటి, అంతటి శ్రీకాంత్ గౌడ్, కునబోయిన ఎల్లవ్వ-దేవయ్య, కునబోయిన రఘు, జీపీవో కవిత, కార్యదర్శి చంద్రశేఖర్, మండల స్థాయి అధికారులు, సెస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన కొమ్మూరి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం,రాజభవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,గురువారం రోజున జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గౌరవ శివ్ ప్రతాప్ శుక్ల ని రాజభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి,జనగామ నియోజకవర్గానికి సంబంధించిన ప్రజా సమస్యలు మరియు ప్రాంతీయ అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారుగవర్నర్ సానుకూలంగా స్పందిస్తూ,ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు అందించారు.

# చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించండి

## సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లేఖ రాశారు.ఉమ్మడి రంగల్ జిల్లాలోని చేర్యాల, మద్దూరు,కొమురవెళ్ళి, ధూళ్మిట్ట మండలాలతో చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు గత పది సంవత్సరాల నుంచి జేఏసీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నూతన మండలాలు ఏర్పాటు చేసిన సందర్భంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉన్నప్పటికీ చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయలేదు. శాసనసభఎన్నికల సందర్భంగా జనగామలో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తమరు చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్ళడానికి దాదాపు ముప్పై ఐదు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సివస్తుంది. అసెంబ్లీ నియోజకవర్గం జనగామ,ఎంపీ భువనగిరి,జిల్లా కేంద్రం సిద్ధిపేట ఇలా వివిధ ప్రాంతాలకు అశాస్త్రీయంగా విడదీయడంతో ఈ ప్రాంత ప్రజలు పనుల కోసం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చేర్యాల ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేర్యాల, మద్దూరు,కొమురవెళ్ళి, దూళిమిట్ట మండలాలను కలుపుకొని చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాల్సిందిగా సీపీఐ పార్టీ పక్షాన తమరిని ప్రత్యేకంగా కోరుతున్నామని పేర్కొన్నారు.చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక ఆకాంక్ష ఆవశ్యకతను గుర్తించిన సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి ల దృష్టికి తీసుకెళ్లినందుకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, చేర్యాల మండల సమితి,జేఏసీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

# చేర్యాల పట్టణంలో రోడ్డు ప్రమాదం విద్యార్థిని మృతి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,చేర్యాల పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థిని కీర్తన(16) పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.వివరాల్లోకి వెళితే..ఆకునూర్ గ్రామానికి చెందిన కీర్తన తన తాత కడుదూరి బాలయ్యతో కలిసి టీవీఎస్ ఎక్సెల్ పై వెళు తుండగా,పాత బస్టాండ్ సమీపంలో వేగంగా వచ్చిన లారీ మోటార్ సైకిల్ ని బలంగా టీ కొట్టడంతో ప్రమాదంలో కీర్తనకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.కీర్తన తాత బాలయ్య (70) కూడా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# వాడపల్లి వెంకన్న చక్రస్నానం ఘనంగా

## అత్యధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



ఆత్రేయపురం ,మన ప్రజాప్రతినధి:వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా 6వ రోజు గురువారం చక్రస్నానం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గౌతమి నది తీరంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి స్వామివారికి చక్రస్నానం చేయించడం జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో సమగ్రంగా నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు చలుమూరి రాంబాబు, సరెళ్ల సరిత, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, మసకపల్లి త్రిమూర్తులు, వాడపల్లి సుందర శేషావతారం తదితరులు పాల్గొన్నారు.అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆలయ సిబ్బంది .పోలీస్ సిబ్బంది సహకారంతో ఏర్పాట్లు సజావుగా జరిగాయి.పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని ఆశీర్వాదాలు పొందారు

# తెలంగాణ ఉద్యమ కారులపై కేసులు ఎత్తివేయాలి





మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల: జనగామ నియోజకవర్గం,తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదకొండు సంవత్సరాలు అవుతున్న ఉద్యమకారులకు తప్పని తిప్పలు నాడు సమైక్య రాష్ట్రంలో మా తెలంగాణ మాకు కావాలని ఉద్యమించిన ఉద్యమకారుల కు నిత్యం కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి సమైక్య రాష్ట్రంలో మాకు పథకాలు ముఖ్యం కాదు మా తెలంగాణ మాకు కావాలనే నినాదంతో నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మా తెలంగాణ మాకు కావాలని నినదించినందుకుగాను సమైక్యపాలన అధికారులు 2011 సంవత్సరంలో సుమారు పదిమంది ఆరుట్ల దశమంత రెడ్డి,బూరుగు సురేష్ గౌడ్,కోనేటి స్వామి, బూడిద కిష్టయ్య,ముసిని బాబుల,పై కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పదిహేను సంవత్సరాలుగా కోర్టు చుట్టూ తిరగడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా అధికారులు స్పందించి తెలంగాణ ఉద్యమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు

మన ప్రజాప్రతినిధి దినపత్రిక

శుక్రవారం ఏప్రిల్ 3 2026



## దళిత క్రైస్తవుల మీద సుప్రీంకోర్టు తీర్పును పునః పరిశీలించాలి
## బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు డిమాండ్



సూర్యాపేట (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):గురువారం నాడు ఆయన బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు సూర్యాపేట పట్టణ సిపిఐ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జంపాల మలయ్య సిపిఐ నాయకులు ఎండి గౌస్ పాషా లతో కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొమ్మ గాని ధర్మం భిక్షం భవన్లో మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినటువంటి క్రైస్తవ పాస్టర్ మీద జరిగినటువంటి దాడిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు దళిత క్రైస్తవులకి ఎస్సీ హక్కులతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రక్షణ పొందలేరన్న తీర్పును సుప్రీంకోర్టు సమర్ధించడాన్నీ బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడుతీవ్రంగా ఖండించారు. భారతదేశంలో మతం మారినంత మాత్రాన కులం మారదు, అంటరానితనం, వివక్ష మారదన్న ప్రాథమిక అవగాహనతో కూడినటువంటి కనీస చట్ట రక్షణను సుప్రీంకోర్టు గ్రహించాలని, సుప్రీంకోర్టు ద్వారా మోడీ ఆర్ఎస్ఎస్,బిజెపి, సంఘపరివార్ వగైరాలు తమ అజెండాను పలికించడం బాధాకరమని గతంలో బాబర్ మసీదు తీర్పు మీద తీర్పునిచ్చిన న్యాయమూర్తులకు గవర్నర్ పదవులు,పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవులు, రాజ్యసభ ఎంపీలు వంటి పదవులు కట్టబెట్టుతున్నారని ఇప్పుడు కూడా దళిత క్రైస్తవులకి హక్కులు వర్తించదు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద రక్షణ పొందలేరన్న తీర్పును ఇచ్చిన హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు భవిష్యత్తులో బిజెపి తరఫున మంచి పదవులు ఇస్తామని మభ్యపెడతారని కావున భారత రాజ్యాంగ ఆర్టికల్ 25 నుంచి 28 వరకు పొందుపరచినటువంటి ప్రకారం భారతదేశంలోని పౌరుడు వారికి ఇష్టమైన మత విశ్వాసాలను చేపట్టొచ్చనే చట్టబద్ధతను విస్మరించి,1950 సంవత్సరంలో రాష్ట్రపతి సవరణ బిల్లును ఉదహరించి ఇలాంటి దుర్మార్గ తీర్పునివ్వడం ఎస్సీలకు చేసే అన్యాయమని,బిజెపి సంఘ్ పరివార్,విశ్వహిందూ పరిషత్,ఆర్ఎస్ఎస్ వారి కుట్రలో భాగమని,కావున సుప్రీంకోర్టు దళిత క్రైస్తవుల మీద ఇచ్చినటువంటి తీర్పును పరిశీలించాలని,అలాగే దేశమంతా కూడా నిరసనలుతో బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం నేర్పిస్తారని ఆయన హెచ్చరించారు.

## ఇసుక తరలింపులో ఇక పూర్తి పారదర్శకత
## 'మన ఇసుక వాహనం' అమలు
### రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ వెల్లడి



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 02:రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇసుక తరలింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు 'మన ఇసుక వాహనం' విధానాన్ని అమలు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ( ఐ డి ఓ సి)లో తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు, గ్రామ పాలన అధికారులకు ఈ కొత్త విధానంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఆన్‌లైన్ విధానంపై అవగాహనసదస్సులో భాగంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన 'మన ఇసుక వాహనం' అప్లికేషన్ మరియు వెబ్‌సైట్ పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా:నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో ఇసుకను ఎలా బుక్ చేసుకోవాలి?చెల్లింపులు చేసే విధానం.ఏ రీచ్ నుండి ఇసుకను పొందాలో ఎంపిక చేసుకోవడం.అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేసే ప్రక్రియపై స్పష్టతనిచ్చారు.పాత పద్ధతికి స్వస్తిగతంలో ఉన్న నేరుగా కూపన్లు ఇచ్చే విధానాన్ని రద్దు చేసి, ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే ఇసుక కేటాయింపులు జరుగుతాయని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా కమిటీ ఆమోదించిన అధికారిక రీచ్‌ల నుండే ఇసుక సరఫరా జరగాలని, ఇందులో ఎటువంటి అవకతవకలకు తావుండకూడదని ఆదేశించారు."ప్రభుత్వ నిర్మాణ పనులు, ఇందిరమ్మ ఇళ్లు, మరియు ప్రైవేట్ భవన నిర్మాణాలకు ఇసుక బుకింగ్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అధికారులు సహాయం అందిస్తారు." గడ్డం నగేష్, అదనపు కలెక్టర్ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా మైనింగ్ అధికారి క్రాంతి కుమార్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ నూతన విధానంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటమే కాకుండా, సామాన్య ప్రజలకు సులభంగా ఇసుక లభ్యమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు

## జనగణన శిక్షణ తరగతులను వాయిదా వేయాలి
## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు 'తపస్' వినతి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 2 మెదక్ జిల్లా, చేగుంట మండలం, జిల్లాలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు, రాబోయే విద్యాసంబంధిత విధులను దృష్టిలో ఉంచుకుని జనగణన (సెన్సస్) శిక్షణ తరగతులను ఏప్రిల్ 23 తర్వాత నిర్వహించాలని తపస్ (తపస్ ) ఉపాధ్యాయ సంఘం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు విన్నవించింది. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన తపస్ ప్రతినిధుల బృందం ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేసింది. ప్రస్తుతం ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల విధుల్లోనూ, సమాంతరంగా జరుగుతున్న మూల్యాంకన (వాల్యుయేషన్ ) ప్రక్రియలోనూ నిమగ్నమై ఉన్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, ఈ నెల 10 నుండి 18 వరకు పాఠశాలల్లో ఎస్ఏ-2 (ఎస్ ఏ -2) పరీక్షలు, అలాగే తెలంగాణ ఓపెన్ టెన్త్ పరీక్షలు కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధ్యాయులపై పనిభారం ఎక్కువగా ఉంటుందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును, పరీక్షల నిర్వహణను పరిగణనలోకి తీసుకుని, జనగణన శిక్షణను ఏప్రిల్ 23 తర్వాతే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల సిద్దు, జిల్లా కోశాధికారి మంగ నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులు గడిల మాధవరెడ్డి, ర్యావ శ్రీధర్ రెడ్డి, హవేలి ఘనపూర్ మండల అధ్యక్షులు తుందెన బిక్షపతి, చేగుంట మండల అధ్యక్షులు రావుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్
## 2 తులాల బంగారం స్వాధీనం



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్లమార్చి ,02:వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను తంగళ్ళపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 తులాల బంగారం, 11 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సి.ఐ నాగేశ్వరరావు తెలిపారు.వివరాల్లోకి వెళ్తే తాడూరి గ్రామంలో మార్చి 30న సాసాల లక్ష్మి అనే మహిళ ఇంట్లో జరిగిన చోరీపై ఎస్.ఐ ఉపేంద్ర చారి బృందం దర్యాప్తు చేపట్టింది. సాంకేతిక ఆధారాలతో నిందితులు మహమ్మద్ అజ్గర్ పాషా, పిట్టల అరవింద్, సామల బాలకిషన్లను మండలపల్లి శివారులో పట్టుకున్నారు. అజ్గర్ పాషా: 21 దొంగతనం కేసులు.అరవింద్: 08 కేసులు.బాలకిషన్: 06 కేసులు.వీరిపై సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల్లో కేసులు ఉన్నాయి. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని సి.ఐ అభినందించారు.

## ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట:మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధి 27 వార్డులో వార్డు సభ మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ (అందెశ్రీ) గారి గీతలపనాతో ఉదయం 10 గంటల నుండి ప్రారంభించు కోవడం జరిగింది వార్డు సభ్యులు పెద్దలు యువత మహిళలు అందరూ వచ్చి తమ తమ సమస్యలు ఆసరా పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు , స్థలాల కేటాయింపు , ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం, రాజీ వికాస్ యోజన తదితర అంశాలపై లిఖిత పూర్వకంగా రాసి వార్డు ఆఫీసర్ గారికి సమర్పించడం జరిగింది. అందుకు వారు సానుకూలంగా స్పందించి.. మీరు ఇచ్చిన అర్జీలపై త్వరలో మున్సిపల్ నుండి సర్వే టీం వచ్చి అర్హులను ఎంపిక చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీమతి అస్తర్గల్ల పల్లె రాణి-బాల్రాజ్ గారు, ప్రోగ్రామ్ ఇంచార్జి నివేద గారు, మాజీ కౌన్సిలర్ మధు, విద్యార్థి నాయకులు కాసాపురం కిరణ్ , కొలుపుల నవీన్ , రాజంపేట ఈశ్వర్ , నాయకులు అరవింద్ , సిద్దిరములు , అంగన్వాడీ టీచర్ మంజుల , ఆశావర్కర్ ప్రేమలత రేషన్ డీలర్ ప్రసాద్, మెప్మ ఆర్పి మీనా తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యునిగా గుగ్గిళ్ళ అంజయ్య దరఖాస్తు



మనప్రజాప్రతినిధి/రాజన్నసిరిసిల్ల, ఏప్రిల్ ,02 :రాజన్నసిరిసిల్లజిల్లా సిరిసిల్ల మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుని పదవికి బిఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీ సీనియర్ నాయకులు, 1వ వార్డు ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ అంజయ్య (అజయ్) గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు తన దరఖాస్తు పత్రాన్ని మున్సిపల్ అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ,పార్టీలోనే కొనసాగుతూ, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 1వ వార్డు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.,వార్డులో పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా, ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తూ వస్తున్నానని అంజయ్య వివరించారు. పార్టీ పట్ల తనకున్న విధేయతను, సీనియారిటీని గుర్తించి, తనకు కో-ఆప్షన్ సభ్యునిగా అవకాశం కల్పించాలని ఆయన పార్టీ అధిష్టానాన్ని కోరారు. బిసి-బి (గౌడ) కులానికి చెందిన తనకు ఈ అవకాశం ఇస్తే మున్సిపాలిటీ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొంటానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.